ప్రజాశక్తి
శుక్రవారం 16 ఫిబ్రవరి 2024
5
అల్లూరి సీతారామరాజు

ఎస్‌టి కమిషన్ సభ్యురాలు పరామర్శ

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: అరకులోయ మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కిల్లో వసంత అనే విద్యార్థిని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న బాధిత కుటుంబాన్ని ఖండ్రుమ్ పంచాయతీ ఒంబిలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు కొర్రా రామలక్ష్మి గురువారం పరామర్శించారు. విద్యార్థిని తల్లిని ఓదార్చారు. 25 కిలోల బియ్యం, పప్పు నూనెను ఆమె అందజేశారు. ఈ సంఘటనను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయడానికి చర్యలు తీసుకుంటానని ఆమె భరోసా కల్పించారు. అనంతరం నందివలస బాలికల ఆశ్రమ, కేజీబీవీ పాఠశాలలు సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షుడు కే.హరి, మాజీ ఎంపీటీసీ టీ.రామదాసు, శోభన్ బాబు పాల్గొన్నారు.

సరుకులు ఇస్తున్న రామలక్ష్మి

బిజెపిపై పోరాటానికి

కార్మిక, కర్షకులు కదలిరావాలి

నేటి సమ్మెను జయప్రదం చేయండి ▸ సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి-అనంతగిరి: దేశంలో ఉన్న వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మిక, కర్షకులపై ఉక్కు పాదం మోపుతున్న బిజెపిపై పోరాటం ఉధృతం చేస్తామని, దీనిలో భాగంగా ఈనెల16న తల పెట్టిన సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు పిలుపునిచ్చారు. అనంతగిరి మండలంలో పర్యటించిన ఆయన ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహలు, డముకు కేంద్రంలో ఉన్న మోటార్ కార్మికులతో మాట్లాడుతూ, నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతుల, కార్మికులపై పన్నుల భారం మోపుతుందన్నారు. బిజెపిపై పోరాట సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. బడా కార్పొరేట్ సంస్థలైన అదాని, అంబానిలను అడ్డం పెట్టుకుని కొత్త చట్టాలు తీసుకువచ్చి, వారికే లక్షలాది కోట్లు రూపాయలు మాఫీ చేస్తుందని దుయ్యబట్టారు.కార్పొరేట్ సంస్థలతో నరేంద్ర మోడీ కుమ్మక్కై చీకటి ఒప్పందాలు కుదుర్చుకుని అడ్డగోలుగా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతుందని విమర్శించారు. సామాన్య రైతుల రుణాలు మాత్రం వడ్డీతో సహా ముక్కు పిండి వసూలు చేయడం మోడీ ప్రభుత్వానికే చెల్లిందని విమర్శించారు. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందనే విషయాన్ని మోడీ గ్రహించాలని సూచించారు. తెచ్చిన చట్టాలను పున:సమీక్షించి ప్రతి రైతు మేలు పొందే విధంగా చేయాలన్నారు. ప్రైవేటు సంస్థలకు కట్టబట్టేందుకు నూతన చట్టం తీసుకువచ్చి మోటారు కార్మికులపై భారాలు మోపుతుందన్నారు. ఈ చట్టంలో కఠినమైన శిక్షలు, జరిమానాలు అధికంగా ఉన్నాయని, ఇలా అయినా సామాన్య మోటార్ కార్మికులు ఏ విధంగా జీవనం సాగిస్తారని ప్రశ్నించారు. దీంతో మోటార్ కార్మికుల భవిష్యత్తు అయోమయంలో పడుతుందన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 16న జరిగే సమ్మెకు కార్మికులు, కర్షకులు కదలి వచ్చి బిజెపిపై పోరాటానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. విశాఖలో స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటు సంస్థలకు కట్టబట్టేందుకు మోడీ ప్రభుత్వం పూనుకుందని, దీనికి వ్యతిరేకంగా సుమారు రెండు సంవత్సరాల కాలం నుండి కార్మికుల పక్షాన పోరాటం చేస్తున్నామన్నారు. ప్రైవేటీకరణపై కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక జెడ్పిటిసి దీసరి. గంగరాజు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు, మండల కార్యదర్శి కె.మొస్య, మోటార్ కార్మికుల యూనియన్ నాయకులు దుడ్డు, శ్యామ్. భగవాన్, బద్రి, సుందరరావు, కార్మికులు పాల్గొన్నారు.

అనంతగిరిలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

ఎన్‌జి రంగా కార్మికుల ధర్నా

చింతపల్లి: చింతపల్లిలో ఆచార్య ఎంజి రంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని, ఈనెల 16న చేపట్టే సమ్మెలో పాల్గొవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు చిన్నయ్య పడాల్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో చేపట్టిన నిరసనలో చిన్నయ్య పడాల్ పాల్గొని మాట్లాడారు.బిజెపి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పరచకుండా మోసగించిందన్నారు. అటవీ సంపదలు, బ్యాంకులు, .ఎల్ఐసి .తదితర సంస్థలన్నింటిని ఆదాని, అంబానీ వంటి కార్పొరేట్ కంపెనీలకు అప్పచెప్పాలని చూస్తుందన్నారు. రైతాంగ ఉద్యమానికి తలవంచి వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేసినా మరో రూపంలో వాటిని అమలు పరుస్తుందని దుయ్యబట్టారు.గత 10ఏళ్లలో బిజెపి ప్రభుత్వం అనుసరించిన విధానాలతో అంబానీ, ఆదానీలు ప్రపంచ కుబేరుల జాబితాలో చేరగా పేదలు మాత్రం అలాగే ఉండి పోయారన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు .బి. రామచందర్. గుంట అర్జున్, కర్రి రాజేశ్వరి, కాకర లక్ష్మి .వంతల కృష్ణ పాల్గొన్నారు.

హుకుంపేట: దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు, రైతులు, డ్రైవర్లు పాల్గొని జయప్రదం చేయాలని వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు పిలుపునిచ్చారు.స్థానికి గిరిజన సంఘం కార్యక్రమంలో గురువారం సమావేశం నిర్వహించారు. అనంతరం ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి తాపుల కృష్ణారావు మాట్లాడుతూ, కనీస వేతనం రూ 26 వేలు ఇవ్వాలని,నూతన మోటార్ చట్టం రద్దు చేసి డ్రైవర్ లకు రక్షణ కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో చిట్టిబాబు, కృష్ణ, సూరిబాబు, నర్సింగరావు, బాలు, భాస్కర్, రవి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చింతపల్లిలో నినాదాలు చేస్తున్న నాయకులు, కార్మికులు

టెట్, డిఎస్‌సి అప్లికేషన్లకు..

ఫీజుల దోపిడీ

- ఎస్‌సి, ఎస్‌టిలకు మినహాయింపు లేదు
- ఆర్థికంగా సతమతం అవుతున్న నిరుద్యోగులు
- తగ్గించాలంటున్న ప్రజా సంఘాల నేతలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్:

ప్రభుత్వ పోటీ పరీక్షలకు దరఖాస్తు అంటేనే నిరుద్యోగులు భయ పడుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగం సంపాదించాలన్న ఆశతో అవమానాలను భరిస్తూ తల్లిదండ్రుల రెక్కల కష్టంపై ఆధారపడి ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న నిరుద్యోగులకు టెట్, డిఎస్‌సి దరఖాస్తు ఫీజు భారంగా మారింది. పరీక్ష రుసుములను ప్రభుత్వం భారీగా వసూలు చేయడంపై నిరుద్యోగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దరఖాస్తుల పరీక్ష ఫీజు అధికంగా ఉండటంతో నిరుద్యోగులకు ఆర్థిక భారంగా మారింది.

పరీక్ష రుసుము వసూళ్లలో భాగంగా ప్రస్తుతం పోస్టుల తక్కువ ఫీజులు భారం ఎక్కువ అన్నట్లుగా ఉంది ఎపి టెట్, డిఎస్‌సి-2024 తీరు. అధికారంలోకి రాగానే 23 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ, ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మాట ఇచ్చి మడమ తిప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 6,100 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. అందులో ఉమ్మడి విశాఖ జిల్లాలో 329 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. దీని ప్రకారం పాఠశాల విద్యాశాఖ పరిధిలో జడ్‌పి, గవర్నమెంట్, మునిసిపల్ పాఠశాలల్లో 99, గిరిజన ప్రాంతంలో 135, రెసిడెన్షియల్ పాఠశాలల్లో 95 కొలువులు భర్తీ చేయనున్నారు. వీటికి వేలాది మంది పోటీపడే అవకాశం ఉంది.

అసలే నిరుద్యోగంతో బాధపడుతున్న వారిపై ఫీజుల భారం వేశారు. పోస్టులు తక్కువ రుసుముల భారం ఎక్కువ అన్నట్లుగా ఉంది పరిస్థితి. వైసిపి ప్రభుత్వం 2022లో చివరిసారిగా ఎపి టెట్ పరీక్ష నిర్వహించింది. అప్పట్లో పేపర్‌కు రూ.500 చొప్పున రుసుము వసూలు చేశారు. తాజాగా ఒక్కో పేపర్ కు రూ.750గా ఫీజు నిర్ణయించారు. ఇందులో ఎస్‌సి, ఎస్‌టి, దివ్యాంగులకు ఎలాంటి మినహాయింపు ఇవ్వకపోవడం గమనార్హం.

సి-టెట్‌కు, ఎపి డిఎస్‌సికి ఫీజుల వ్యత్యాసం

గత నెల కేంద్ర ప్రభుత్వం సి-టెట్ నిర్వహించింది. ఒక్కో పేపర్‌కు రూ.500గా నిర్ణయించింది. రెండు పేపర్లు రాస్తే రూ.600 మాత్రమే వసూలు చేసింది. అదే రాష్ట్రానికి వచ్చేసరికి పేపర్‌కు రూ.750 చొప్పున ఎన్ని పేపర్లు రాయాలంటే అన్నింటికీ చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడింది. డిఎడ్, బిఇడి, ఎంఇడి విద్యార్హత ఉన్నవారు టెట్ మూడు పేపర్లను రాస్తారు. అదే డిఎడ్, బిఇడి అర్హతలుంటే తప్పనిసరిగా రెండు పేపర్లు రాయాలి. 2018 తరువాత డిఎస్‌సి లేకపోవడంతో మూడు ఉపాధ్యాయ విద్యార్హతలు ఎక్కువ మందికి ఉన్నాయి. ఒక్కో పేపర్‌కు రూ.750 చొప్పున మూడు పేపర్లకు రూ.2,250, రెండు పేపర్లకు రూ.1500 చెల్లించాల్సి వస్తోంది. ఈనెల 17వ తేదీ వరకు ఎపి టెట్ పరీక్ష ఫీజు చెల్లించేందుకు అవకాశముంది. ఆన్ లైన్ ద్వారా నగదు తీసుకుంటున్నారు. ఫీజు తగ్గించాల్సింది పోయి పెంచడం ఏంటని నిరుద్యోగులు మండిపడుతున్నారు. 2018 డిఎస్ సికి హాజరైన అభ్యర్థుల నుంచి అప్పట్లో పేపర్ కు రూ.500 చొప్పున ఫీజు వసూలు చేశారు. తాజాగా ఒక్కో పేపర్ కు రూ.750 గా ఫీజు నిర్ణయించడంతో నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాఠ్యపుస్తకాలకూ ఖర్చు ఎక్కువే..

టెట్‌తో పాటు డిఎస్‌సికి సిద్ధమయ్యేందుకు అవసరమైన పుస్తకాల కోసం రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు చెల్లించాల్సి వస్తుందని నిరుద్యోగులు వాపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చేందుకు స్టడీ సర్కిల్ ఉండేవి. వైసిపి అధికారంలోకి వచ్చాక విద్యార్థులు సొంతంగా పరీక్షకు సిద్ధం అవ్వాల్సిన దుస్థితి నెలకొంది.

నిరుద్యోగులకు భారం

ఒక్కో అభ్యర్థి కనీసం టెట్‌కు రెండు, డిఎస్‌సికి రెండు పోస్టులకు అర్హులయ్యే అవకాశం ఉంది. అయితే ఒక అభ్యర్థి రెండు పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలంటే రూ.1500, టెట్ రెండు పేపర్లకు రూ.1500 మొత్తం కలిపి దరఖాస్తు రుసుమే రూ.3000 అవుతుండగా, ఇంటర్నెట్ నిర్వాహకులు ఆన్లైన్ లో దరఖాస్తు చేసేందుకు ఒక్కో దానికి రూ.100 నుంచి 200 వరకు వసూలు చేస్తున్నారు. మొత్తం నాలుగు దరఖాస్తులకు కలిపి రూ.3800 అవుతుండడంతో నిరుద్యోగులకు భారంగా మారింది.

జీవన్ కష్ణ
ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

రాయితీలు ఇవ్వక పోవడం దారుణం

టెట్, డిఎస్‌సి దరఖాస్తు ఫీజు నిరుద్యోగులకు భారంగా మారింది. ఎంతోమంది నిరుద్యోగులు రుసుము కోసం అప్పులు చేస్తున్నారు. దీంతో నిరుద్యోగుల నుంచి భారీగా ఫీజులు వసూలు చేయడమేంటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. పరీక్ష ఫీజులను విచ్చలవిడిగా పెంచడం ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు భారంగా మారింది. సాధారణంగా రాష్ట్ర,జాతీయ స్థాయి ఉద్యోగ, పోటీ పరీక్షలైనా ఎస్ సి, ఎస్ టి కేటగిరీలకు చెందిన వారికి ఫీజులో కొంత రాయితీ ఉంటుంది. ప్రస్తుత టెట్, డిఎస్ సికి రాయితీ ఇవ్వకపోవడం సరికాదు.

ప్రభుదాస్
డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు

ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు నాగేశ్వరరావు

ఉపాధి హామీ పని దినాలు పెంచాలి

ప్రజాశక్తి- కూనవరం

ఉపాధి హామీ చట్టం కింద పని దినాలు 200 రోజులకు పెంచాలని సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని కూటూరులో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలను వారు కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ కూలీలకు పని దినాలు పెంచడంతో పాటు రోజు వేతనం రూ.600 ఇవ్వాలని, ఉపాధి చట్టానికి కేంద్రం నిధులు పెంచాలని, రాష్ట్ర ప్రభుత్వం కూలిలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని కోరారు. పై సమస్యల పరిష్కారానికి ఈ నెల 16న జరుగు దేశ వ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. దేశంలో కార్మిక, కర్షకులు ఎదురుకుంటున్న సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

గిరిజన యువతకు ఉచితంగా డ్రైవింగ్ శిక్షణ

ప్రజాశక్తి-చింతూరు

రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా రవాణా శాఖ అధికారులు, చింతూరు పోలీసులు, సిఆర్పిఎఫ్ అధికారులు సంయుక్తంగా గిరిజన యువతీ యువకులకు ఉచితంగా డ్రైవింగ్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పులి ఆనందరావు మాట్లాడుతూ యువత డ్రైవింగ్ చేసేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, సీట్ బెల్టు పెట్టుకోవాలని, లైసెన్స్ కలిగి ఉండాలని, రహదారి భద్రత నియమాలను పాటించాలని సూచించారు. వాహనాలకు, ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మెలగాలన్నారు. అనంతరం శిక్షణ తరగతులు నిర్వహించి డ్రైవింగ్‌లో మెలకువలు నేర్పించారు. ఎల్ఎల్ఆర్ టెస్టులు రాయించి పాస్ అయిన వారందరికీ ఎల్ఎల్ఆర్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ పి దివాకర్, సిఐ గజేంద్ర కుమార్, ఎస్ఐ దుంపల శ్రీనివాస్, రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



యువకులకు ఎల్ఎల్ఆర్ లైసెన్స్‌లో అందజేస్తున్న రవాణా శాఖ అధికారులు

తాగునీరు, వైద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

మండల పరిషత్తు సమావేశంలో ఎంపిపి, జెడ్‌పిటిసి ఆదేశం

మాట్లాడుతున్న ఎంపిపి కారం లక్ష్మి

ప్రజాశక్తి-విఆర్.పురం

వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకొని తాగునీటి సమస్యలు రాకుండా, వైద్య సేవలు అందుబాటులో ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపిపి కారం లక్ష్మి, జెడ్‌పిటిసి వాళ్ళ రంగారెడ్డి అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్తు సమావేశం మందిరంలో గురువారం ఎంపిపి కారం లక్ష్మి అధ్యక్షతన మండల పరిషత్తు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్ కుమార్ మాట్లాడుతూ కల్తూనూరులో ఇవ్వాలసిన రేషన్ బియ్యాన్ని జీడిగుప్పలో ఇవ్వడంతో ఒక్కొక్కరు రూ.200 ఖర్చు చేసి వ్యయ ప్రయాసలు పడాల్సి వస్తుందని, ఇది న్యాయంగా ఉందా? అని అధికారులను ప్రశ్నించారు. ప్రభుత్వమే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి డోర్ టు డోర్ బియ్యాన్ని అందించాలని డిమాండ్ చేశారు. ఎంపిటిసి పూనెం ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ చిన్నమట్టపల్లి స్కూల్లో మిడ్డే మిల్స్ ఆయాలకు బియ్యం సప్లై చేయాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన వైద్యం అందించాలని, రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవరిస్తే ఊరుకోమని హెచ్చరించారు. ఎమర్జెన్సీ కేసులు కోతులగుట్ట ఆసుపత్రికి పంపి, మెరుగైన చికిత్స అందించాలని కోరారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో తహశీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్, ఎంపిడిఓ ఫణీంద్ర రెడ్డి, రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజిని, పెద్దమట్టపల్లి సర్పంచ్ వెట్టి లక్ష్మీ, రామవరం సర్పంచ్ కారం బుచ్చమ్మ, ములకనపల్లి సర్పంచ్ సవలం మారయ్య, సర్పంచ్ పిట్టా రామారావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

సమస్యలపై నిలదీస్తున్న సిపిఎం ప్రజాప్రతినిధులు సంతోష్‌కుమార్, ప్రదీప్‌కుమార్

జిసిసి ద్వారా అటవీ ఉత్పత్తుల మార్కెటింగ్

సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సురేష్‌కుమార్

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని గిరిజనులు దళారుల దగ్గర మోసపోకుండా అటవీ ఉత్పత్తులను గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ (జిసిసి) ద్వారా మార్కెటింగ్ చేసే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిసిసి మేనేజింగ్ డైరెక్టర్ జి.సురేష్ కుమార్ పేర్కొన్నారు. దేవీపట్నం మండలం పెదభీంపల్లి, పోతుకొండ, గంగవరం మండలం గంగవరం, పిడత మామిడి, జగ్గంపాలెం గ్రామాల్లో గురువారం ఆయన వందన్ వికాస కేంద్రాల సభ్యులతో సమావేశం నిర్వహించి గిరిజనులు పండించిన ఉత్పత్తులను మార్కెటింగ్ పంపడంపై మాట్లాడారు. ఈ సందర్భంగా సురేష్ కుమార్ మాట్లాడుతూ ఏజెన్సీలోని ఒక్కొక్క విడివికెలో 300 మంది సభ్యులు ఉంటారన్నారు. గిరిజనులు పండించిన జీడిమామిడి పిక్కలు, జొన్నలు వంటివి గిరిజన విడిపికె సభ్యులు ప్రాసెసింగ్ చేయడానికి వివిధ రకాలైన మిషన్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. వీడీవీకే సభ్యులకు గిరిజనులు పండించిన ఉత్పత్తులను మార్కెటింగ్ పంపే విధంగా అవగాహన కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. వీడీవీకే సభ్యులు తయారు చేసిన ప్రొడెక్టను జిసిసి ద్వారా మార్కెటింగ్ చేస్తామన్నారు. గిరిజనులు, గిరిజన విడివికె సభ్యులు దళారుల దగ్గర మోసపోకుండా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏజెన్సీలోని వందన్ వికాస కేంద్రాలు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిసిసి డివిజనల్ మేనేజర్ జి.పార్వతీశ్వరరావు, వెలుగు ఏపీడి ఎ.శ్రీనివాసరావు, జిసిసి మార్కెటింగ్ సెక్షన్ అధికారి ఆర్‌వి.రమణమూర్తి, ఫిరోజ్, జిసిసి సీనియర్ మేనేజర్ యంవియన్ రాజారెడ్డి, వెలుగు యాంకర్ పర్సన్ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులతో మాట్లాడుతున్న జిసిసి మేనేజింగ్ డైరెక్టర్ జి.సురేష్ కుమార్

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ పని చేస్తున్నారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని జడ్డంగి నుండి చిన్నయ్యపాలెం మీదుగా సింగంపల్లి వరకు రూ 2.6 కోట్ల వ్యయంతో 6.3 కిలోమీటర్ల మేర నిర్మించనున్న బిటి రోడ్డు నిర్మాణ పనులకు, చిన్నయ్యపాలెం గ్రామంలో పిఎం జన్‌మన్ పథకం ద్వారా నూతనంగా మంజూరైన గృహాలకు గురువారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి వైసిపి ప్రభుత్వం విశేష కృషి చేస్తుందన్నారు. టిడిపి హయాంలో మాటల తప్ప ఏజెన్సీ అభివృద్ధి ఎక్కడ కానరాలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షులు కొంగర మురళీకృష్ణ, సొసైటీ అధ్యక్షులు సింగిరెడ్డి రామకృష్ణ, ఎంపీటీసీ కానేమ్ అచియమ్మ, వైసిపి నాయకులు దాట్ల వెంకటేశ్వరరాజు, కనిగిరి వీరబాబు, కె దుర్గాప్రసాద్, నాగులపల్లి కుశరాజు, సింగిరెడ్డి రవి, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

బోడిదొరకు ఎమ్మెల్యే, జెడ్‌పి చైర్‌పర్సన్ పరామర్శ

ప్రజాశక్తి-కొయ్యూరు

స్వాతంత్ర్య సమరయోధులు, అల్లూరి సీతారామరాజు ముఖ్య అనుచరుడు మల్లుదొర మనవడు బోడిదొర విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతుండగా, ఆయన్ను ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పాడేరు శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి గురువారం పరామర్శించారు. మోతాదుకు మించి బీపీ మాత్రలు వాడడంతో అనారోగ్యానికి గురైన బోడిదొరను చికిత్స నిమిత్తం కేజీహెచ్‌లో చేర్చారు. ఆరోగ్య పరిస్థితిపై భాగ్యలక్ష్మి, సుభద్ర ఆరా తీశారు. ఆయనకు మెరుగైన సేవలు అందించాలని వైద్యులను కోరారు. ఈ సందర్భంగా ఆయనకు ఆర్థిక సాయం చేశారు.

బోడిదొరను పరామర్శిస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

'పది' పరీక్షలకు పటిష్ట చర్యలు

- జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీ

విద్యార్థులను చదివిస్తున్న డిఇఒ బ్రహ్మాజీ

ప్రజాశక్తి-పెదబయలు: పదవ తరగతి పరీక్షలకు పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఆకస్మికంగా పర్యటించారు. బాలుర రెసిడెన్షియల్ పాఠశాల సమావేశం మందిరంలో మండల ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. అనంతరం గురుకుల పాఠశాలను తరగతి గదులను పరిశీలించారు. బోధనపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆంగ్ల మాధ్యమ పుస్తకాలు చదివించారు. అనంతరం ఆయన ప్రజాశక్తి తో మాట్లాడుతూ, పది పరీక్షల్లో ఎటువంటి అవంతరాలు కలుగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. విద్యార్థులను తీర్చి దిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే అన్నారు. విద్యార్థులకు పరీక్షల భయం లేకుండా చూడాలని సూచించారు. వెనకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేకంగా శ్రద్ధ చూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి కొమ్ము కృష్ణమూర్తి, ఇంచార్జి ప్రిన్సిపాల్ చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

నేడు స్పందన రద్దు

ప్రజాశక్తి-పాడేరు : పాడేరులో ఈ నెల 16న శుక్రవారం జరగనున్న జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం కొన్ని పరిపాలనా పరమైన కారణాలతో రద్దు చేశామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. స్పందన కార్యక్రమానికి విజ్ఞప్తులు అందించదలచిన ప్రజలు గమనించి స్పందనకు రావద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

విద్యతోపాటు ఉద్యోగావకాశం

- ఎనిమిది మందికి ఆఫర్ లెటర్లు ఇచ్చిన శంకర్ ఫౌండేషన్

ప్రజాశక్తి- వేపగుంట : నాయుడుతోట శంకర్ ఫౌండేషన్ కాలేజీకి అనుబంధంగా ఉన్న కాలేజీలో మూడేళ్ల ఆప్తోమెట్రీ బిఎస్‌సి కోర్సును విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు అదే సంస్థలో ఇంటర్న్‌షిప్ ఇప్పించి, పర్మినెంట్ ఉద్యోగాల్లో నియమించుకున్నారు. ఈ సందర్భంగా శంకర్ ఫౌండేషన్ సీఈవో (అడ్మిన్ అండ్ ఆపరేషన్స్) కె.రాధాకృష్ణన్ మాట్లాడుతూ, సమాజానికి సేవ చేయడానికి ఆసక్తి ఉన్న అభ్యర్థులకు సొంతంగా నిలబడేలా జీవనోపాధికి జాబ్ ఓరియెంటెడ్ కోర్సులను అందించడానికి శంకర్ ఫౌండేషన్ మరింత ప్రాధాన్యతనిస్తోందన్నారు. స్కూల్ ఆఫ్ ఆప్తోమెట్రీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ పాఠశాలలో అందిస్తున్న ఆప్తోమెట్రీలో డిగ్రీ, డిప్లొమా కోర్సులను వివరిస్తూ, విద్యార్థులు నేర్చుకోవడంపై దృష్టి సారించాలని, ఆసుపత్రిలో సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డీఈవో వి.రమేష్ కుమార్ మాట్లాడుతూ, వివిధ ఆసుపత్రుల్లో జాబ్ ఓరియెంటెడ్ ప్రమాణిక కోర్సుల గురించి మాట్లాడారు. ఈ సందర్భంగా బిఎస్‌సి ఆప్తోమెట్రీ ఎనిమిది యువకులు, ఒక యువకునికి శంకర్ ఫౌండేషన్‌కు సేవలందించేందుకు ఆఫర్ లెటర్లను అందజేశామని మేనేజర్ (హెచ్ఆర్) ఎం.శివప్రసాద్ తెలిపారు. సీనియర్ మేనేజర్ (ట్రైనింగ్) కె. వినోద్‌కుమార్, ఐ.బంగార్రాజు, డిప్యూటీ జనరల్ మేనేజర్ (పీఆర్ అండ్ లైజన్) అధ్యాపకులు అలేఖ్య, మౌనిక, దుర్గ పాల్గొన్నారు.

రెండో రోజుకు సిహెచ్‌డబ్ల్యుల దీక్షలు

మాట్లాడుతున్న సుందరరావు

ప్రజాశక్తి-పాడేరు : ఆశా వర్కర్లుగా తమను మార్చాలని కోరుతూ అల్లూరి జిల్లాలోని పాడేరు డివిజన్లో పనిచేస్తున్న సామాజిక ఆరోగ్య కార్యకర్తలు (కమ్యూనిటీ హెల్త్ వర్కర్) (సి హెచ్ డబ్ల్యు) లు ప్రభుత్వాన్ని, జిల్లా అధికారులను గత కొన్ని ఏళ్ళుగా వేడుకుంటున్నారు. తమ మొర అధికారులు ఆలకించడం లేదని ఆవేదనతో ఐటీడీఏ ముందు ఇటీవల కాలంలో దఫదఫాలుగా ధర్నాలు చేస్తూ తమ గోడు వెళ్లబోసుకుని. మరోసారి ఐటీడీఏ ముందు సిహెచ్‌డబ్ల్యులు చేపట్టిన మూడు రోజుల సామూహిక నిరాహార దీక్ష గురువారం రెండవ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు ఎల్ సుందరరావు, ఆశా వర్కర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మంగమ్మ మాట్లాడుతూ, పాడేరు డివిజన్లోని 11 మండలాల్లో ఉన్న 36 ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆశా వర్కర్లుగా గుర్తింపబడని సుమారు 687 మంది సిహెచ్‌డబ్ల్యులు పనిచేస్తున్నామని, తాముతా ఆశా వర్కర్లతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్నామని తెలిపారు. అయినా తమకు వేతనాలు చెల్లింపులో అన్యాయం జరుగు తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సిహెచ్‌డబ్ల్యులకు సమాన పనికి సమాన వేతనం అందడం లేదని అన్నారు.

సిహెచ్‌డబ్ల్యులకు కేవలం నాలుగు వేలు మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. సిహెచ్‌డబ్ల్యు లను తక్షణమే ఆశా వర్కర్లుగా గుర్తించి పదివేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. యూనిఫామ్ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు పి.రామమ్మ, జిల్లా కమిటీ సభ్యులు కిల్లో పద్మ, కిల్లు పార్వతి, చింతపల్లి కొయ్యూరు, జీకే వీధి, పాడేరు, హుకుంపేట మండలాల సిహెచ్‌డబ్ల్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మితిమీరిన సాంకేతికత వినియోగంతో

మానసిక సమస్యలు

కృత్రిమ మేధ నుంచి స్మార్ట్‌ఫోన్ వినియోగం వరకు ఎన్ఎపి సదస్సులో చర్చలు

సదస్సులో పాల్గొన్న సైకాలజీ రంగ ప్రముఖులు

ప్రజాశక్తి - మధురవాడ : సామాజిక మాధ్యమాలు, కృత్రిమ మేధ, స్మార్ట్‌ఫోన్ల మితిమీరిన సాంకేతికత వినియోగంతో చిన్న పిల్లల నుంచి పెద్దవారి వరకు వారి నైపుణ్యాలను హరించడంతోపాటు పలు మానసిక సమస్యలు ఉత్పన్నమౌతున్నా యని పలువురు మానసిక పరిశోధకులు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో నేషనల్ అకాడమీ ఆఫ్ సైకాలజీ (ఎన్ఎపి) 33వ వార్షిక సమావేశాల్లో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మానసిక శాస్త్ర వేత్తలు, పరిశోధకులు పలు ఆసక్తికర అంశాలను వెల్లడించారు. రాజస్థాన్ జోధ్‌పూర్‌లోని సర్దార్ పటేల్ యూనివర్సిటీ ఆఫ్ పోలీస్ పరిశోధకుడు డాక్టర్ అభిషేక్ శర్మ మాట్లాడుతూ ప్రతి చిన్న అంశానికి కృత్రిమ మేధపై ఆధారపడటం వల్ల యువతలోని సహజ నైపుణ్యాలు క్రమేపీ కనుమరుగవుతున్నాయని తమ అధ్యయనం ద్వారా గుర్తించామన్నారు. రూ.పాలులోని జగదీష్ లేకేసెటి యూనివర్సిటీ పరిశోధకుడు వి.భరమ్‌భట్ మాట్లాడుతూ అధికంగా స్మార్ట్‌ఫోన్ వినియోగంతో వ్యక్తిగత సంబంధాలు, భార్యాభర్తల మధ్య అనురాగం దెబ్బతింటోందన్నారు. రాజస్థాన్ పరిశోధకులు డాక్టర్ ప్రవీణ్ జీత్, జ్యోతి శర్మ మాట్లాడుతూ, సామాజిక మాధ్యమాల ప్రభావంతో సమాజంలో పర్యవలు, మత కలహాలు ఆస్కారమేర్పడుతోందని పోలీస్‌శాఖతో కలిసి తాము జరిపిన పరిశోధనల్లో వెల్లడైందన్నారు. ఇండోర్ ఐఐఎమ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ రైనా ఛాబర్ మాట్లాడుతూ, ఉన్నత చదువు, ఉద్యోగాల నిమిత్తం పట్టణాలకు వచ్చే యువతలో ఒంటరితనం మానసిక సమస్యలకు కారణమౌతోందని, చివరకు అది చెడు అలవాట్లకు, ఆత్మహత్యలకు ప్రేరేపిస్తోందన్నారు. కోవిడ్ సమయంలోనూ, తర్వాత పిల్లల మానసిక పరిస్థితులలో వచ్చిన మార్పులపై అధ్యయనం జరిపిన అలహాబాద్ విశ్వవిద్యాలయం, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం పరిశోధకులు తాము గుర్తించిన అంశాలను వెల్లడించారు. కౌమార్య దశలో ఉన్న పిల్లలలో నిద్రలేమి, ఏకాగ్రత లోపించడం, తలనొప్పి, కడుపునొప్పి వంటివి మానసిక అంశాలను ప్రభావితం చేస్తోందన్నారు. కోవిడ్-19 సమయంలో ఉద్యోగాలు కోల్పోయిన మహిళలలో 40 శాతం మంది మానసికంగా కుంగిపోయి పలు సమస్యలను ఎదుర్కొన్నారని వెల్లడించారు.

సదస్సులో రెండవ రోజు జరిగిన చర్చలలో మనిషి మెదడుకు నిద్రలో వచ్చే కలలకు మధ్య సంబంధాన్ని, రోజువారీ జీవితంలో వాటి ప్రభావాన్ని పశ్చిమ బెంగాల్ విశ్వవిద్యాలయ సైకాలజీ విభాగం పరిశోధకుడు డాక్టర్ అలోక్ నందిని ఆసక్తికరంగా వివరించారు. భగవద్గీత పఠనంతో కలిగే ప్రయోజనాలను హర్యానా కేంద్రీయ విశ్వవిద్యాలయం పరిశోధకులు తాన్యా శర్మ, రవి పాండే వెల్లడించారు. ఆ స్కూల్ సైకాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ సమావేశాల కన్వీనర్ డాక్టర్ డి.రవికిరణ్ మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీతో సమావేశాలు ముగుస్తాయని తెలిపారు.

17న సర్టిఫికెట్ల పరిశీలన

ప్రజాశక్తి - పాడేరు : గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ఆశ్రమ పాఠశాలలో జిపిఎస్ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఎస్జీటీలు, తత్సమాన ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించుటకు అర్హులైన ఉపాధ్యాయులకు ఈ నెల 17న సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎ.కొండలరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదోన్నతులు కల్పన కోసం ఫైనల్ సీనియారిటీ జాబితాను ప్రధానోపాధ్యాయులకు పంపించామని తెలిపారు. ఆ ప్రకారం పదోన్నతులు పొందుటకు అర్హత కలిగిన ఉపాధ్యాయులందరూ 17న ఉదయం 10 గంటలకు గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకుల కార్యాలయంలో జరిగే పరిశీలనకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

ఐద్వా జాతీయ సమావేశాలను

జయప్రదం చేయండి

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఐద్వా నేతలు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: ఈ నెల 23 నుండి 25 వరకు జరిగే ఐద్వా జాతీయ కార్యవర్గ సమావేశాలను జయప్రదం చేయాలని ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు, ఆదివాసి గిరిజన మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.హైమావతి, జిల్లా అధ్యక్షులు టి.కొసల్య, రాష్ట్ర కమిటీ సభ్యులు వి వి జయ పిలుపునిచ్చారు. గురువారం అరకువేలి ఆదివాసి గిరిజన భవనంలో స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం దేశవ్యాప్తంగా మహిళా పరిరక్షణకు, మహిళా అభ్యున్నతికి కృషి చేస్తుందని అన్నారు. ఈ నెల 23,24,25 తేదీల్లో జాతీయ సమావేశాలకు విశాఖ వేదిక కావడం హర్షించదగ్గ విషయమన్నారు. దేశంలో రోజు రోజుకు మహిళలపై హింస పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు సామాజికంగా, ఆర్థికంగా రాజకీయంగా పురుషులతో పాటు సమాన అవకాశాలు కల్పించినప్పుడే సమానత్వం సాధ్యమని చెప్పారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో నిరుద్యోగం, పేదరికం, నిరక్షరాస్యత పెరిగాయని విమర్శించారు. బేటీ బచావో బేటీ పఢావో అన్న మాట నినాదంగానే మిగిలిపోయిందని అన్నారు. కేంద్రం ప్రశ్నించే గొంతును నొక్కే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఈ సదస్సుకు విద్యార్థులు, యువకులు, కార్మికులు, శ్రామిక మహిళలు, ఉపాధ్యాయులు, మేధావులు తరలి వచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అరకు మండల అధ్యక్ష కార్యదర్శులు భాగ్యవతి, శశికళ, అనంతగిరి మండలం అధ్యక్ష కార్యదర్శులు దేవుడమ్మ, కాసులమ్మ, డుంబ్రిగూడ అధ్యక్ష కార్యదర్శులు కుమారి,కుసుమ, తదితరులు పాల్గొన్నారు.

జవాన్లకు ఘననివాళి

ప్రజాశక్తి -అనందపురం: జమ్ముకశ్మీర్ పుల్వామాలో ఉగ్రదాడిలో అమరులైన 40 మంది సిఆర్‌పిఎఫ్ జవాన్లకు ఆనందపురంలో జై జవాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘననివాళులర్పించారు. వెలిగించిన కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. జై జవాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కుప్ప రాజశేఖర్ ఆధ్వర్యంలో భారతి విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు పాల్గొని అమరులైన భరతమాత ముద్దు బిడ్డలైన జవాన్లకు జోహార్లర్పించారు. యాత సంక్షేమ సేవ సంఘం అధ్యక్షులు అంగటి రాము, కొట్టాడ సత్యమూర్తి, కుప్ప అప్పలరాజు, వైస్ ప్రెసిడెంట్ ముడసల శ్రీను, జనరల్ సెక్రెటరీ ఎమంది శ్రీనివాసరావు, కుప్ప శ్రీను, కుప్ప చెంచునాయుడు, కుప్ప సూరిబాబు, నాగల ముత్యాలు, పీతల శ్రీను ఎల్లయ్య, అప్పలరాజు, బద్రి కళ్యాణ్, హరి ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వంటకాలను పరిశీలిస్తున్న డీడీ

ఆశ్రమ పాఠశాలల్లో డీడీ తనిఖీలు

ప్రజాశక్తి-చింతూరు : రంపచోడవరం ఐటిడిఎ గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ గురువారం మండలంలోని తులసిపాక, గూడూరు, బొడ్డుగూడెం, విద్యానగరం, ఈడిపల్లి, నల్లకుంట, కేవీ పురం గ్రామాల్లోని పాఠశాలలను సందర్శించి తనిఖీలు చేశారు. పది తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆదేశించారు. ఆశ్రమ స్కూళ్ల, హాస్టళ్లలో సదుపాయాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంటకాలను పరిశీలించారు. గురువారం రాత్రి కేవీ పురం రాత్రి బస చేశారు.

టర్నర్ చౌల్ట్రీ ట్రస్ట్ బోర్డు ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : టర్నర్ చౌల్ట్రీ ట్రస్ట్ బోర్డు ప్రమాణ స్వీకార కార్యక్రమం కార్యనిర్వాహణ అధికారి ఎస్.ప్రశాంతి లక్ష్మి ఆధ్వర్యంలో గురువారం జరిగింది. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ధర్మకర్తల మండలి చైర్మన్‌గా దమ్ముతులు మాణిక్యాలరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మరో ఐదుగురు ట్రస్ట్ బోర్డు సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ టర్నర్ చౌల్ట్రీ ట్రస్ట్ మరింత అభివృద్ధి చెందే విధంగా సేవలందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నూతన ట్రస్ట్ బోర్డు సభ్యులు కోరాడ సురేష్, కడిలి రమణమ్మ, ఎస్.సత్యవతి, దొడ్డి పైడిరత్నం, అడిచారం సూరిబాబు, పలువురు కార్పొరేటర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

40వ రోజుకు ఎంవివి పాదయాత్ర

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ తూర్పు నియోజకవర్గంలో విశాఖ పార్లమెంట్ సభ్యులు, వైసిపి తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త ఎంవివి.సత్యనారాయణ పాదయాత్ర గురువారానికి 40వ రోజుకు చేరుకుంది. జివిఎంసి 22వ వార్డు శివాజీపాలెం, ఆదర్శ కాలనీ వీధి ప్రాంతాలలో వైసిపి వార్డు ఇన్‌ఛార్జి పీతల గోవిందుతో కలిసి ఈ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవివి.సత్యనారాయణ మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా సిఎం జగన్ పాలన సాగిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బోణి శివరామకృష్ణ, చొక్కర శేఖరరావు, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, చైర్మన్లు పాల్గొన్నారు.

వెలమలకు ఎన్నికల్లో సీట్లు కేటాయించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రానున్న ఎన్నికల్లో వెలమ సామాజిక తరగతికి 23 అసెంబ్లీ, 5 పార్లమెంటు స్థానాలలో అన్ని రాజకీయ పార్టీలూ ప్రాధాన్యత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వెలమ కుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చుక్క చినబాబు డిమాండ్ చేశారు. గురువారం నగరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే అన్ని రాజకీయ పార్టీలకూ వినతిపత్రాలు అందజేశామన్నారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఆరు ఎమ్మెల్యే స్థానాలు కల్పించాలని అన్ని రాజకీయ పార్టీలను కోరుతున్నట్లు తెలిపారు.

ఆదివాసీలతో పోస్టులను భర్తీ చేయాలి

ప్రజాశక్తి-పెదబయలు: ఏజెన్సీ పోస్టులను స్థానిక ఆదివాసులతో భర్తీ చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా కన్వీనర్ రామారావు దొర ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ డీఎస్సీ నోటిఫికేషన్‌లో షెడ్యూల్ ప్రాంతాల ఆదివాసులకు తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్ నియమాలను అనుసరించి ఏజెన్సీ పోస్టులను స్థానిక ఆదివాసీలతో భర్తీ చేసేలా నోటిఫికేషన్ లో మార్పు చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీలో బయటి వారికి ఉద్యోగాలు కట్టబెట్టడం రాజ్యాంగ విరుద్ధమని విమర్శించారు.

వికలాంగుల సంక్షేమానికి కృషి

- కేంద్ర మంత్రి పర్షోత్తం రూపాల
- విశాఖలో 1589 మంది విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాల పంపిణీ

వికలాంగులకు ట్రై సైకిళ్లు అందజేస్తున్న మంత్రి పర్షోత్తం రూపాల

ప్రజాశక్తి - సీతమ్మధార, ఎంవిపి.కాలనీ, కలెక్టరేట్ విలేకరులు

వికలాంగుల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, డెయిరీ శాఖ మంత్రి పర్షోత్తం రూపాల పేర్కొన్నారు. ఎడిఐపి పథకం కింద గురువారం విశాఖలోని కైలాసపురం డిఎల్‌బి గ్రౌండ్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో సామాజిక అధికారిత శిబిర్ పేరుతో నిర్వహించిన వికలాంగులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వికలాంగులకు అందరూ ఆదరువుగా నిలవాల్సి ఉందన్నారు. రూ.2.25 కోట్లతో 2,925 పరికరాలను అలింకో సంస్థ ఆధ్వర్యంలో తయారు చేయగా 1,589 మంది వికలాంగులకు మంత్రి వాటిని అందజేశారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు జివిఎల్.నర్సింహారావు, వివిధ ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఎమ్‌డి కుమార్ రాజా, జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మత్స్య పరిశ్రమ అభివృద్ధికి తోడ్పాటు

దేశవ్యాప్తంగా మత్స్య పరిశ్రమ అభివృద్ధిపై కేంద్రం దృష్టి సారించిందని మంత్రి పర్షోత్తం రూపాల అన్నారు. నీతి ఆయోగ్, ఎపి రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో విశాఖలోని గ్రీన్ పార్క్ హోటల్‌లో రెండు రోజులు పాటు 'లోతట్టు రాష్ట్రాల మత్స్య సంపదను వినియోగం' అంశంపై తలపెట్టిన సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో నీతి ఆయోగ్ సీనియర్ అడ్వైజర్ డాక్టర్ నీలం పటేల్, ఎపి ప్రభుత్వ ఆక్వా డెవలప్‌మెంట్ బోర్డు వైస్ చైర్మన్ వడ్డి రఘురాం, రాజ్యసభ సభ్యులు జివిఎల్.నరసింహారావు, మత్స్యశాఖ జెడి ఎస్.కె.లాల్ మహమ్మద్ మాట్లాడారు. సదస్సులో ఆంధ్రప్రదేశ్, కేరళ, ఉత్తరాఖండ్, బీహార్, అస్సాం, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తర ప్రదేశ్, కర్నాటక, తెలంగాణ, పంజాబ్, హర్యానా రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వయోశ్రీ యోజనతో మేలు

రాష్ట్రీయ వయోశ్రీ యోజన పథకం ద్వారా వయో వృద్ధుల జీవితాల్లో సంతోషాలను నింపేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి పర్షోత్తం రూపాల అన్నారు. గ్రాండ్ బే హోటల్లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వయో వృద్ధుల అవసరాల మేరకు కళ్లద్దాలు, వీల్ చైర్లు, వినికిడి మిషన్లు, కృత్రిమ దంతాలు, ట్రైపాడ్, ఊతకర్ర తదితరాలను ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. ముందుగా రాష్ట్రీయ వయోశ్రీ యోజన పథకం గోడపత్రికను ఆవిష్కరించారు.

పకడ్బందీగా టెన్త్, ఇంటర్ పరీక్షలు

జెసి మయూర్ అశోక్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : టెన్త్, ఇంటర్ పరీక్షలను పకడ్బందీ ఏర్పాట్లు నడుమ నిర్వహించనున్నట్లు విశాఖ జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. మార్చి 1 నుంచి 20 వరకు ఇంటర్, 18 నుంచి 30 వరకు టెన్త్ పరీక్షల నిర్వహణపై గురువారం అధికారులతో కలెక్టర్ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో జరగనున్న పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. జిల్లాలో మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు ఇంటర్మీడియట్ థియరీ, ప్రాక్టికల్ పరీక్షలు, మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు 10వ తరగతి పరీక్షలు జరగనున్నాయని తెలిపారు. 10వ తరగతి పరీక్షలకు మొత్తం 31,379 మంది హాజరవుతున్నారని, వారిలో రెగ్యులర్ విద్యార్థులు 28,367 మంది, ప్రైవేట్ విద్యార్థులు 3,012 మంది ఉన్నారని చెప్పారు. రెగ్యులర్ విద్యార్థుల్లో 14,972 మంది బాలురు, 13,294 మంది బాలికలు ఉన్నట్లు తెలిపారు. అలాగే ప్రథమ సంవత్సర ఇంటర్మీడియట్ పరీక్షలకు 40,873 మంది విద్యార్థులు, ద్వితీయ ఏడాదికి 41,806 మంది విద్యార్థులు హాజరుకానున్నారని వివరించారు. జిల్లా వ్యాప్తంగా 138 పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు జరగనుండగా, 93 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు జరగనున్నట్లు వెల్లడించారు. 10వ తరగతి పరీక్షలు ప్రతి రోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు, ఇంటర్ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. జిల్లా సమన్వయ కమిటీ సభ్యులందరూ సమన్వయంతో పనిచేసి 10వ తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలను విజయవంతం చేయాలని కోరారు. నిర్ణీత సమయానికి ముందుగానే పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు చేరుకునేలా అవగాహన కల్పించాలని, విద్యార్థులు ఎలాంటి ఒత్తిళ్లకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసే విధంగా చూడాలని కోరారు. పోలీస్ శాఖ ద్వారా పరీక్ష కేంద్రాల వద్ద గట్టి భద్రతా ఏర్పాట్లను చేయాలని, పరీక్షల సమయంలో 144 సెక్షన్ అమలు చేయాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల సమీపంలో ఎక్కడా కూడా జిరాక్స్ కేంద్రాలు ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

పరీక్షా కేంద్రాల వద్ద ఇతర వ్యక్తులు ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా పరీక్షా కేంద్రాలలో వైద్య సిబ్బందిని నియమించి ఒఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు, అలాగే ప్రథమ చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షల సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. విద్యార్థులకు సరిపడా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిఇఒ ఎల్.చంద్రకళ, ఆర్ఐఒ పి.మురళీధర్, డివిఇఒ బి.రాజ్, పోలీస్, జివిఎంసి, వైద్యారోగ్య, తపాలా, విద్యుత్, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహశీల్దార్ నజీముల్లా షా

బియ్యం పంపిణీ వేగవంతం

ప్రజాశక్తి-చింతూరు : ప్రతినెల 15వ తేదీలోగా రేషన్ బియ్యాన్ని పంపిణీ చేయాలని డీలర్లకు చింతూరు తహశీల్దార్ నజీముల్లా షా సూచించారు. గురువారం డీలర్లతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీలర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గోడౌన్ నుంచి ప్రతి వస్తువు తీసుకున్న తర్వాతే తంబ్ వేయాలని డీలర్లకు సూచించారు. ఎటువంటి అవకతవకలు పాల్పడరాదన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ బి. దేమయ్య, సీనియర్ అసిస్టెంట్ పండా రామకృష్ణ, మండలంలోని రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడిలో గాయపడ్డ జింక పిల్ల మృతి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని అప్పలరాజుపేట గ్రామంలోని బుధవారం వీధి కుక్కలు దాడిలో తీవ్రంగా గాయపడిన మచ్చల జింక పిల్ల గురువారం రాత్రి మృతి చెందింది. రాజవొమ్మంగి పంచాయతీ అప్పలరాజుపేట సమీప అటవీ ప్రాంతం నుంచి దారితప్పి మూడు నెలల వయసు ఉన్న మచ్చల జింక గ్రామంలోకి రావడంతో వీధి కుక్కలు గాయపరిచాయి. స్థానికుల సమాచారం మేరకు ఎఫ్ఎస్ఓ రాము ఆధ్వర్యంలో పశు వైద్య సిబ్బంది దానికి ప్రథమ చికిత్స నిర్వహించారు. గురువారం రాత్రి మచ్చల జింక మృతి చెందినట్టు సెక్ డిఎఫ్ఓ రామారావు తెలిపారు. పశు వైద్య సిబ్బంది పోస్ట్ మార్టం నిర్వహించి, వీఆర్వో సచివాలయ సిబ్బంది ఫారెస్ట్ సిబ్బంది సమక్షంలో ఖననం చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో రాజారావు ఫారెస్ట్ సెక్షన్ అధికారి రాము, ఎఫ్బిఒ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖ నగరంలో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

కొనసాగిన ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ గురువారం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ వేదిక ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆవరణలోని ఎన్‌జిఒ హోం వద్ద భోజన విరామ సమయంలో పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. జెఎసి విశాఖ జిల్లా చైర్మన్ కె.ఈశ్వరరావు, ఆర్.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : 30 శాతం ఐఆర్ మంజూరు, డిఏ, పిఆర్‌సి బకాయిల విడుదల, అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ పునరుద్ధరణ, హెల్త్ కార్డుల మంజూరు, అన్ని శాఖల్లో ఖాళీ పోస్టులను శాశ్వత ప్రాతిపదికన భర్తీ తదితర డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ భీమిలిలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి ఆర్డీఓ, తహశీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన తెలిపారు. ఎపి ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల జెఎసి పిలుపు మేరకు చేపట్టిన ఈ నిరసనలో జెఎసి భీమిలి తాలూకా యూనిట్ అధ్యక్షులు ఎం.లోవరాజు, కార్యదర్శి కె.సాయిబాబా, కన్వీనర్ కె.ముత్యాలరావు, పింఛనుదారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు టి భీమారావు, ఎం.ఆనందరావు పాల్గొన్నారు.